# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ సాధనలో ఏఐటీయూసీ ఉద్యమమే కీలకం

**15న ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు.. విఫలమైతే ఆగస్టులో సమ్మె హెచ్చరిక**



**కొత్తగూడెం సింగరేణి, జూలై 10 (తెలంగాణ వాణి)**

తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలనే డిమాండ్‌తో తొలి ఉద్యమం చేపట్టింది ఏఐటీయూసీయేనని ఆ సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 2013లోనే తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు గురైన ఘనత ఏఐటీయూసీకే దక్కిందన్నారు. ప్రస్తుతం తాడిచర్ల-2తో పాటు మిగిలిన అన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల ఉపాధి భద్రత కోసం ఇది అత్యంత అవసరమని పేర్కొన్నారు. సమ్మె నోటీసుకు సంబంధించి కీలక పురోగతి నమోదైందని, ఈ నెల 15న రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయని వెల్లడించారు. చర్చలు విఫలమై ఆర్ఎల్‌సీ ఫెయిల్యూర్ రిపోర్ట్ జారీ చేస్తే ఆగస్టులో సమ్మెకు వెళ్లడం తప్పదని హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, ప్రతి కార్మికుడికి రావాల్సిన 40 శాతం లాభాల వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెర్క్‌పై విధిస్తున్న ఆదాయపన్నును రద్దు చేయాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వసూలు చేసి, ఆ నిధులతో కొత్త ప్రాజెక్టులను తీసుకొచ్చి సంస్థ మనుగడను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బాయి బాట కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ పాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు సానుభూతి చూపడం సమంజసం కాదన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను, వారి కుటుంబాల ఇబ్బందులను శాసనసభలో నిరంతరం ప్రస్తావించిన ఏకైక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కే. సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు ఎర్రగని కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరిస్తున్న రేవంత్ సర్కార్‌పై వామపక్ష విద్యార్థి సంఘాల ఆగ్రహం

**భద్రాద్రి కొత్తగూడెంలో**

**విద్యాసంస్థల బంద్ విజయవంతం**

**కొత్తగూడెం, జూలై, 10 (తెలంగాణ వాణి)**




తెలంగాణలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. విద్యా సమస్యల పరిష్కారంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పూర్తిగా విజయవంతమైంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించగా, ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బుర్రి వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోందని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు రూ.250 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి సంతోష్, గుగులోత్ వీరభద్రం, పీడీఎస్‌యూ నాయకులు విఘ్నేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలోని 5 గనులకు జాతీయ స్థాయిలో అత్యుత్తమ 5-స్టార్ రేటింగ్

**అత్యుత్తమ గనులుగా ఆర్.కె న్యూటెక్, ఆర్.కె-6, జె.వి.ఆర్ ఓసి-2, ఖైరిగూడ, ఆర్. జి ఓసీ-1**

**గనులు7 విభాగాల్లో 50 అంశాలలో అత్యుత్తమంగా నిలిచిన గనులు**

**రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అభినందనలు**

**కొత్తగూడెం సింగరేణి, జూలై 10 (తెలంగాణ వాణి)**

కేంద్ర బొగ్గుశాఖ ప్రతీ ఏటా నిర్వహించే అత్యుత్తమ గనుల ఎంపికలో ఈ సారి సింగరేణి సంస్థ నుండి 5 గనులు 5-స్టార్ రేటింగ్ సాధించి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపిక య్యాయి. కేంద్ర బొగ్గు శాఖ విడుదల చేసిన జాబితాలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆర్.కె న్యూటెక్, ఆర్.కె-6, సత్తుపల్లి ఏరియా నుండి జె.వి.ఆర్ ఓసి-2, బెల్లంపల్లి ఏరియా నుండి ఖైరిగూడ ఓపెన్ కాస్టు గని, రామగుండం-3 ఏరియా నుండి ఆర్.జి ఓసి-1 గనులు అత్యుత్తమ 5-స్టార్ రేటింగ్ గనులుగా ఎంపికైనట్లుగా ప్రటించారు. దేశవ్యాప్తంగా 382 గనులు ఈ 5 స్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో 50 గనులు 5 స్టార్ రేటింగ్‌కు ఎంపిక కాగా, అందులో 5 గనులు సింగరేణి నుంచి ఉండటం విశేషం. గత ఏడాది 4 గనులకు ఈ 5-స్టార్ రేటింగ్ రాగా ఈ సారి 2024-2025 సంవత్సరానికి గాను సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 5 గనులకు 5-స్టార్ రేటింగ్ లభించడం విశేషం. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉత్తమ గనుల అధికారులకు, కార్మికులకు, సిబ్బందికి తన అభినందనలు తెలిపారు. ఇతర గనులకు కూడా ఈ గనులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బొగ్గు గనుల్లో ఉత్తమ పని విధానం, కార్మిక సంక్షేమం, పర్యావరణహిత చర్యలు, సమీప గ్రామాల అభివృద్ధి వంటి 7 ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో అత్యుత్తమంగా ఉంటున్న గనులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు తన అనుబంధ సంస్థ అయిన కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రతీ ఏడాది ఈ పోటీని నిర్వహిస్తున్నారు. కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారు ప్రతీ ఏటా దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల నుండి 5-స్టార్ రేటింగ్ లో పాల్గొనవల్సిందిగా ఆహ్వానం పలుకుతుంటారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బొగ్గు మైనింగ్ కంపెనీలు ఈ 5-స్టార్ రేటింగ్ కోసం స్వీయ మూల్యాంకనం నిర్వహించుకుని దరఖాస్తు చేస్తుంటాయి. ఇందులో ప్రధానంగా 7 విభాగాల్లో గనుల ప్రతిభ, పని పరిస్థితులు పరిగణనలోకి తీసుకుంటారు. ఆ గనుల్లో మైనింగ్ ఎలా నిర్వహిస్తారు? బొగ్గు తవ్వకం టెక్నాలజీని సమర్థవంతంగా వాడుతున్నారా? గని ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి? గని ప్రభావిత ప్రాంతాలలో, గ్రామాలలో సంక్షేమ చర్యలు, కార్మిక సంక్షేమ చర్యలు ఏ స్థాయిలో అమలవుతున్నాయి?, రక్షణ, కార్మికుల భద్రతకు తీసుకొంటున్న చర్యలు, పర్యావరణహిత చర్యలు వంటివి పరిశీలనకు తీసుకొంటారు. ఈ 7 ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో ఏ గనులు అయితే నూటికి 90 శాతం మార్కులు పై బడి సాధిస్తాయో వాటిని 5-స్టార్ (అత్యుత్తమ) గనులుగా గుర్తిస్తారు. 5-స్టార్ రేటింగ్ ఇచ్చేముందు కోల్ కంట్రోలర్ విభాగానికి చెందిన నిపుణుల బృందం ఆ గనులను సందర్శించి, ఆ గనులు ఇచ్చిన సమాచారం సరైనదేనా? కాదా? అని తనిఖీ చేస్తారు. ప్రత్యక్ష పరిశీలనలో సంతృప్తి చెందిన తర్వాతనే అత్యుత్తమ గనులను 5-స్టార్ రేటింగ్ గనులుగా ఎంపిక చేసి ప్రకటిస్తారు. సింగరేణి సంస్థలో కూడా కోల్ కంట్రోలర్ విభాగం నిపుణుల బృందం




ఇటీవల ప్రత్యక్ష పరిశీలన జరిపింది. అనంతరం 5 గనులను 5 స్టార్ రేటింగుకు ఎంపిక చేసింది. సింగరేణి సంస్థ పనితీరుకు, రక్షణ, భద్రత, పర్యావరణహిత చర్యల అమలుకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయని ఉత్తమ గనుల అధికారులు పేర్కొంటున్నారు.

**4 స్టార్ రేటింగ్ లో మరో 17 గనులు**

ఇదిలా ఉంటే 5-స్టార్ కన్నా కొంచెం తక్కువ మార్కులు (80-90 శాతం) సాధించిన గనులను 4 స్టార్ రేటింగ్ గనులు అంటారు. ఈ గనులకు ఎటువంటి అవార్డులు ఇవ్వరు కానీ దాదాపు ఉత్తమ శ్రేణి వరకు వచ్చిన గనులుగా గుర్తింపు వస్తుంది. సింగరేణిలో ఈ సారి 4-స్టార్ రేటింగ్ ను 17 గనులు సాధించడం విశేషం. కొద్ది మార్కుల తేడాతో ఈ గనులు 5-స్టార్ రేటింగ్ ను కోల్పోయాయి.

**ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అభినందనలు**

సింగరేణిలో 5 గనులు తమ అత్యుత్తమ పనితీరుతో జాతీయ స్థాయిలో 5-స్టార్ రేటింగ్ గనులుగా గుర్తింపు పొందినందుకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. క్రమ శిక్షణ, రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణహిత చర్యలను సమర్థంగా అమలు జరుపుతూ, రాష్ట్ర అవసరాలకు తగిన బొగ్గును ప్రమాద రహితంగా అందిస్తున్నందుకు ఆయన సంస్థ యాజమాన్యానికి, గనుల అధికారులకు, కార్మికులకు తన అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని గనులు అత్యుత్తమ పనితీరుతో 5-స్టార్ రేటింగ్ సాధించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

# బీఎంఎస్ కృషి ఫలితమే తాడిచర్ల బొగ్గు బ్లాక్ కేటాయింపు

**కృతజ్ఞతగా ఎబికెఎంఎస్, బి.ఎం.ఎస్ ఆధ్వర్యంలో**

**గేట్ మీటింగ్, మిఠాయిల పంపిణీ**

**కొత్తగూడెం సింగరేణి, జూలై 10 (తెలంగాణ వాణి)**



తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన కేంద్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ బి ఎం ఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో సత్తుపల్లి జేవిఆర్ఓసిలో పిట్ సెక్రటరీ ఉప్పు శ్యాంసుందర్ అధ్యక్షతన శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించి, గని కార్మికులు, అధికారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఏబి కెఎంఎస్, బిఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.వి. కృష్ణారెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా ఈ సందర్భంగా పి. మాధవ నాయక్ మాట్లాడుతూ, గత రెండేళ్లుగా తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని బీఎంఎస్ నిరంతరం కేంద్ర బొగ్గుఅండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించిందని తెలిపారు. ఇటీవల కూడా యూనియన్ ప్రతినిధులు నేరుగా కలిసి ఈ బొగ్గు గని సింగరేణికి ఎంత అవసరమో సమగ్రంగా వివరించగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. అయితే బీఎంఎస్ నిరంతర కృషికి లభించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా సింగరేణిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు కలిపి సుమారు 75 వేల కుటుంబాల భవిష్యత్తుకు భరోసా లభించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి సింగరేణి కార్మికుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జియోలాజికల్ ఎక్స్‌ప్లోరేషన్ నివేదిక ప్రకారం తాడిచర్ల బొగ్గు బ్లాక్‌లో సుమారు 277 మిలియన్ టన్నుల జి-8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉండగా, సుమారు 182 మిలియన్ టన్నుల వరకు తవ్వకాలకు అవకాశం ఉందని వివరించారు. ఈ గని సింగరేణి భవిష్యత్తుకు, కార్మికుల ఉద్యోగ భద్రతకు, సంస్థ విస్తరణకు కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా ఐఎన్‌టీయూసీ నాయకులు ఈ గని కేటాయింపును తమ ఘనతగా చెప్పుకోవడం విచారకరమని అన్నారు. నిజంగా కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి సింగరేణికి రావలసిన రు. 56వేల కోట్ల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్ నిరంతర పోరాట ఫలితంగా సాధించిన విజయాన్ని తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న సింగరేణిని ఆదుకునేందుకు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతో సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు లభిస్తున్నాయని వివరించారు. ఇది సంస్థ భవిష్యత్తుకు ఎంతో శుభపరిణామమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం పోరాడుతూ ఫలితాలు సాధిస్తున్న కార్మిక సంఘం బీఎంఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త బొగ్గు గనులు, ఉపాధి అవకాశాలు, సంస్థ విస్తరణ కోసం కార్మికులందరూ బీఎంఎస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ విత్తనాల నాగ ప్రసాద్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఐత రవి, జె. క్రాంతి, ఎస్. శ్రీనివాస్, ఎం.వి. చారి, హెడ్ ఓవర్‌మెన్‌లు బి. సురేష్, ఎం. సురేష్, బల్లి శ్రీనివాస్, అలీ ప్రకాష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

